


# అన్యాయం

కట్టా రాంబాబు

“నమస్కారం మాస్టారూ!”

నా ఎదురుగా ఒక యువకుడు నిలబడి వున్నాడు.

అతణ్ణి నేను గుర్తు పట్టలేదు.

“నువ్వు...”అంటూ ఆగాను.

“నేను మాస్టారూ శ్రీనివాస్‌ని. మీ దగ్గర నాలుగు సంవత్సరాల క్రితం బి.ఎ.చదివాను” అన్నాడు.

“ఏమీ అనుకోకయ్యా! నిన్ను గుర్తు పట్టలేకపోయాను. కూర్చో” అంటూ ప్రక్కన చోటు చూపించాను.

అతను కూర్చున్నాడు.

అది ఒంగోలు బస్టాండ్.

పగలంతా ఒంగోల్లో పని పూర్తి చేసుకుని మా వూరు పోదామని బస్టాండ్‌కొచ్చాను. బస్సు లేకపోవడంతో బల్లమీద కూర్చున్నాను. అప్పుడు వచ్చాడు శ్రీనివాస్.

“ఇప్పుడు చెప్పు. ఏం చేస్తున్నావు? ఎక్కడ వుంటున్నావు?” అనడిగాను.

“ఏం చెయ్యడం లేదు మాస్టారూ. ఖాళీగానే వుంటున్నాను. ఉద్యోగం కోసం చెయ్యని ప్రయత్నం లేదు. ఎక్కడా చిన్న ఉద్యోగం కూడా దొరకలేదు. ఆర్థిక ఇబ్బందులతో నానా ఇబ్బందులు పడుతున్నాను. మీరు మాకు సెకండియర్లో నిరుద్యోగ సమస్య గురించి పాఠం చెబుతున్నప్పుడు ఒక ప్రముఖ రచయిత్రి చెప్పిన మాటలను ఉదాహరణగా చెప్పారు.

ఒక స్త్రీ భర్తను కోల్పోయి వైధవ్యాన్ని అనుభవిస్తున్నప్పుడు పడే బాధకంటే ఒక నిరుద్యోగికి ఉద్యోగం దొరక్క పోతే పడే బాధ ఎక్కువగా వుంటుందని. అది అక్షరాలా నిజం మాస్టారూ! నేను అంతకంటే ఎక్కువగా బాధపడుతున్నాను” అన్నాడు ఆవేశంగా.

అతనలా అంటుంటే నాకు చాలా బాధ కలిగింది.

నిజమే ప్రస్తుతం నిరుద్యోగ సమస్య ఎంతమందిని ఎన్ని రకాలుగా బాధ పెడుతుందో కదా అనుకున్నాను.

మా దగ్గర చదువుకునే చాలామంది విద్యార్థులు నిరుద్యోగులుగా తిరుగుతూ ఉంటే బాధ కలుగుతూ వుంటుంది. అయితే ఏం చెయ్యలేని నిస్సహాయస్థితి.

ఎందుకు పనికిరాని డిగ్రీ చదువులు చెప్పి వాళ్ళని పనికిరాని వాళ్ళుగా చేస్తున్నానేమో అనిపిస్తుంది. ఈ డిగ్రీలు చదవకపోతే ఏదో ఒక పని చేసుకునేవారేమో.

కాస్సేపు కాలేజీ కబుర్లు చెప్పుకున్నాం.

బస్సు ఇంకా రాలేదు.

“నేను వెళతాను మాస్టారూ!” అంటూ పైకి లేచి మళ్ళీ కూర్చున్నాడు. అతనేదో అడగటానికి సంశయిస్తున్నాడు.

“ఏమిటయ్యా! ఏం కావాలి?” అనడిగాను.

“అర్జంటుగా చిలకలూరిపేట పోవాలి సార్! చేతిలో డబ్బులేమీ లేవు. ఓ యాభై రూపాయలుంటే ఇవ్వండి. నేను వారం రోజుల్లో ఇచ్చేస్తాను. మన కాలేజీలో పని చేస్తున్న అప్పారావు మా మామయ్యేసార్. ఆయన ద్వారానైనా పంపిస్తాను” అన్నాడు. ఇంకేం ఆలోచించకుండా యాభై రూపాయలు

తీసిచ్చాను. 'థ్యాంక్స్' చెప్పి అతనెళ్ళిపోయాడు.

ఇంతలో నేనెక్కాల్సిన బస్సు రావడంతో అదెక్కాను.

అందులో అప్పారావు గారు కూర్చుని వున్నారు.

"రండి మాస్టారూ!" అని పిలిచారు. వెళ్ళి ఆయన ప్రక్కనే కూర్చున్నాను.

ఆయన విజయవాడ నుంచి వస్తున్నారట.

"ఇప్పుడు మీ శ్రీనివాస్ కనిపించాడు" అన్నానాయనతో.

"మా శ్రీనివాసా? అతనెవరు?" అన్నారాయన ఆశ్చర్యంగా.

"అదేనండీ! మీ మేనల్లుడు శ్రీనివాసు" అన్నాను.

"నాకెవరూ మేనల్లుళ్లు లేరండీ! అసలు నాకు చెల్లెళ్ళు గాని, అక్కలు గాని లేరు. కనీసం కజిన్సు కూడా లేరు. ఇంక మేనళ్లు ఎక్కడి నుంచి వస్తారండీ?" అన్నారాయన నవ్వుతూ.

జరిగింది చెప్పానాయనకు.

"మీకే కాదు మాస్టారూ! నాకూ ఒకసారిలాగే జరిగింది. ఆ శ్రీనివాసెవడో గాని చాలా మందిని మోసం చేస్తున్నాడు. నన్నూ ఇలాగే అడిగి తను మన వెంకటరావుగారి అన్నగారబ్బాయినన్నాడు. మన స్టాఫ్‌లో చాలామందికి ఇలాగే చెప్పి డబ్బులు కొట్టేశాడట. మన దగ్గర చదువుకుని మనల్నే మోసం చేస్తున్నారు చూడండి. ఏం చేస్తాం రోజులలా అయిపోయాయి" అన్నారాయన.

ఒక మోసగాడికి సహాయం చేసినందుకు నాకు చాలా బాధ కలిగింది.

ఓ రోజు సాయంత్రం ఇంటి నుంచి బజారుకు బయలుదేరాను. శ్రీమతి ఏవో సరుకులు కావాలని చీటి రాసిస్తే వాటిని తీసుకొద్దామని బయలుదేరాను. ఓ మాజీ విద్యార్థి ఎదురు పడి 'నమస్తే సార్' అన్నాడు. అతనికి చిరునవ్వుతో రిప్లయిచ్చి ముందుకు నడిచాను.

ఈ ఉద్యోగం చేస్తున్నందుకు అప్పుడప్పుడూ గర్వంగా అనిపిస్తుంది. ఎందుకంటే ఈ ఇరవై ఏళ్ళ సర్వీసులో కొన్ని వేల మంది నా దగ్గర చదువుకుని వుంటారు. వాళ్ళలో కొంతమందైనా మమ్మల్ని గుర్తు పెట్టుకుని పలకరిస్తుంటారు. ఉత్తరాలు రాస్తుంటారు. మంచి మంచి ఉద్యోగాలు చేస్తున్నవాళ్ళు తమ స్థితికి మేమే కారణమంటూ (గ్రాటిట్యూడ్స్) తెలుపుతుంటారు.

అంతేకాకుండా జాబ్ శాటిస్ఫెక్షన్ కూడా వుంటుంది. షాపులో సరుకులు తీసుకుని ఇంటికి పోతుంటే ఒకతను వెనుక నుంచి 'సార్' అన్నాడు. అతని వంక చూశాను. అతని ముఖం చాలా దీనంగా వుంది. గడ్డం పెరిగి, బట్టలు మాసిపోయి వున్నాయి.

"ఏం" అన్నాను.

"నేను మీ దగ్గర పదేళ్ళ క్రితం డిగ్రీ చదివాను సార్. నా పేరు రామ్మూర్తి సార్! మాది పక్కనే వున్న వూరు. అప్పుడు మీరు నన్ను అభిమానించేవారు. డిగ్రీ ఫస్టుక్లాసులో పాసయినా ఉద్యోగం దొరకలేదు. ఏవో చిన్న చిన్న పనులు చేసుకుంటూ బతుకుతున్నాను. నా కొడుక్కీ మధ్య ఆరోగ్యం బాగుండటం లేదు. ఎంతమందికి చూపించినా తగ్గడం లేదు. ఉదయం నుంచీ బాగుండకపోతే హాస్పిటల్‌కి తీసుకొచ్చాను. వెంటనే మందులు వాడాలని డాక్టరు చీటీ రాసిచ్చాడు. వాటికి నాలుగొందల వుతాయట. నా దగ్గర రెండొందలున్నాయి. ఇంకో రెండొందలుంటేనే గాని అవి పూర్తిగా రావు. నాకిక్కడ తెలిసిన వాళ్ళెవరూ లేరు. వూరికి పోయి తీసుకొచ్చే టైము కూడా లేదు. అవి వెంటనే వాడితేనే గాని నా కొడుకు బతకడు సార్. నాకొక్కడే కొడుకు లేకలేక పుట్టాడు. మీరు సాయం చేస్తే ఆ మందులు కొంటాను. రెండొందలుంటే ఇవ్వండి. ఆ డబ్బులు మా వూరెళ్ళి తెచ్చిస్తాను" అన్నాడు దీనంగా. అతనలా చెబుతుంటే అతని కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. అప్పుడతన్ని చూస్తే నాకు చాలా జాలి కలిగింది.

అతనికివ్వాలంటే రెండొందలు నా దగ్గర వున్నాయి.

కానీ నాకప్పుడు శ్రీనివాస్ గుర్తుకొచ్చాడు. అతడు చేసిన మోసం గుర్తుకొచ్చింది. ఇతను కూడా అతనిలాగే మోసం చేస్తున్నాడా అనే అనుమానం కూడా వచ్చింది. మరోసారి మోసపోవడం నాకిష్టం లేదు. అందుకే లేవని చెప్పేశాను. అతను నానుంచి అటువంటి జవాబు ఆశించి వుండడు. అందుకే నిరాశగా వెళ్ళిపోయాడు. నాక్కూడా కొంచెం గిల్టీగా అనిపించింది. అయినా అందరికీ సహాయం చేస్తూపోతే దీనికి అంతెక్కడుంటుంది. అయితే రాత్రంతా నాకు దీనంగా వున్న రామ్మూర్తి ముఖమే గుర్తుకొచ్చింది.

మర్నాడు కాలేజీ కెళుతుంటే రామ్మూర్తి ఎదురొచ్చాడు. అతని చేతుల్లో దుప్పటిలో పూర్తిగా కప్పబడిన బిడ్డ వున్నాడు. ప్రక్కన భార్య గుండెలు బాదుకుని ఏడుస్తోంది. రామ్మూర్తి కళ్ళల్లో నుంచి నీళ్ళు కారుతున్నాయి. స్కూటర్ ఆపి ' ఏం జరిగింది రామ్మూర్తీ!" అడిగాను. అంతవరకూ బిగపట్టుకున్న దుఃఖాన్ని నేనలా అడగడంతో ఒక్కసారిగా బోరుమన్నాడు. "నా కొడుకు చచ్చిపోయాడు సార్!" అన్నాడు నా వంక చూస్తూ. ఆ చూపుల్లో నా బిడ్డ చావుకు మీరు కూడా కారణమే అన్నట్టనిపించింది.

'సారీ' చెప్పి కాలేజీకెళ్ళిపోయాను. ఆ రోజు పాఠాల్ని సరిగ్గా చెప్పలేకపోయాను. ఆ రాత్రి రామ్మూర్తి చూపులే నాకు పదే పదే గుర్తుకొచ్చాయి. ఆ రెండొందలు ఇచ్చుంటే ఆ బిడ్డ బ్రతికేవాడేమో. రామ్మూర్తి దంపతుల కడుపు కోతకు నేనూ కారణమేమోననిపించింది.

శ్రీనివాస్ లాంటి మోసగాళ్ళున్నప్పుడు రామ్మూర్తిలాంటి వాళ్ళకి అన్యాయం జరుగుతూనే వుంటుంది.

❋

